# నిన్నా - నేడూ - రేపూ

మామగారు చదువుకుంటూన్న గోవింద నామాలు చెవుల బడేసరికి బద్ధకంగా లేచి కూర్చుంది అన్నపూర్ణ. కిటికీ తెర బయట తెల్లటి వెలుగు తెలతెల వారటాన్ని నిరూపించింది. నెమ్మదిగా లేచి వరండా లోకి వచ్చింది. రామారావు ఓసారి పుస్తకంలోంచి తలెత్తి చూశాడు.

"రంగ వెళ్ళిపోయిందా?" అంది.

"ఆఁ వెళ్ళింది. ఇప్పుడే" మళ్ళీ పుస్తకం అడ్డం పెట్టుకున్నాడు.

రంగ వచ్చి పని చేసి వెళ్ళిందనటానికి సాక్ష్యం — తళతళా మెరుస్తోన్న గిన్నెలూ — చీడీల మీద సన్నటి ముగ్గుచారలూ — బూడిద తీసి శుభ్రంచేసి వుంచిన కుంపటీ — అన్నిటినీ మించి చదువులో రామారావు ఏకాగ్రతానూ. అయినా ఎందుకో అలా అడిగింది అన్న పూర్ణ.

"మిమ్మల్ని గదిలోనే చదువుకోమన్నానుగా? మళ్ళీ ఇక్కడి కొచ్చి కూర్చున్నారేం?" అంది ఏదో కూపీ తియ్యాలన్న ధోరణిలో.

"మీరంతా నిద్రపోతోంటే నేను లైటు వేసుకుని కూర్చోటం ఏం బాగుంటుంది?" అహింసా వాదిలా చూశాడు రామారావు కళ్ళు పైకెత్తి.

"బాగుంది. మాకులేని ఇబ్బంది మీకెందుకూ?"

"ఐనా పిల్లల్నీ, నిన్నూ చూస్తుంటే నేనిక చదివినట్టే! ఎవళ్ళో ఒకళ్ళు కదులుతూ మెదులుతూ వుంటారు. అలా చూస్తుంటే.... చదువేం సాగుతుంది?"

ఆ మాటలేమీ నమ్మకం కలిగించలేదు అన్న పూర్ణకి! "హూఁ ఇంకా ఈ చదువు ఎన్నాళ్ళుంటుంది? ఎప్పుడేమిటి పరీక్షలు?"

"అప్పుడే ఎక్కడ? రెండు నెలల పైనేవుంది. ఏం? ఎందుకలా అడిగావు?"

"పరీక్ష పాసైతే ప్రమోషనొస్తుందా?"

"అబ్బే, పరీక్ష పాసైనంత మాత్రాన ప్రమోషన్ రాదుగానీ — ప్రమోషన్ రావాలంటే మాత్రం పరీక్ష పాసై వుండాలి. ఏదో ఆఫీసు వాళ్ళు పెట్టారు. చదువు తున్నాం తప్పదుగా?"

"ఊఁ, బాగానే వుంది."

అన్నపూర్ణ కుంపటిలో బొగ్గులువేసి కుంపటి వెలి గించటానికి కూర్చుంది.

రామారావు పుస్తకం మూసి లేచి గదిలోకి వెళ్ళి పోయాడు.

పెద్దవాడు లేచి ఇంగ్లీషు పద్యాలు కాబోలు కంఠస్థం చేసుకుంటున్నాడు. మిగతా పిల్లల్ని ముగ్గుర్నీ రామారావు పేరు పేరునా పిలిచి లేపటానికి ప్రయ త్నిస్తున్నాడు. చంటిముండ ఏడుస్తూ తల్లి దగ్గిరికి బయలుదేరింది. తిన్నగా వచ్చి వొడిలో దూరి పోయింది.

"ఎందుకే వెధవ ఏడుపూ నువ్వూనూ. బారెడు పొద్దెక్కినా ఇంకా లేవకేంజేస్తావ్?" అంటూ కసిరేసింది అన్నపూర్ణ.

బావురుమంది చంటిది.

"ఒసేవ్ చిట్టితల్లీ! ఇటు రా! నేనెత్తుకుంటాను. మీ అమ్మ కొడుతుంది. ఇటు రా మరీ!" అంటూ లాల నగా పిలిచాడు తాతగారు. చంటిముండ ఏడుస్తూ వెళ్ళిపోయింది.

"అమ్మా! ఇవ్వాళ మాకు క్లాసు పరీక్ష వుందే! నేను తొందరగా వెళ్తాను" పెద్దవాడు లేచి వచ్చాడు.

"వెళ్ళూ! నన్నేం చెయ్యమంటావు?" అంది ఎర్రగా చూస్తూ అన్నపూర్ణ.

తెల్లబోయాడు పెద్దవాడు — కిక్కురుమనకుండా పళ్ళపొడి అందుకుని పెరట్లోకి పోయాడు.

ఎర్రగా వెలుగుతున్న బొగ్గులమీద నీళ్ళుపడేసి లేచింది అన్నపూర్ణ.

"అమ్మా! కాఫీ అయిందేమో తాతయ్య అడగ మంటున్నాడే!" అంటూ వచ్చింది పెద్దపిల్ల.

అన్నపూర్ణకి ఒక్కసారి కోపం ముంచుకొచ్చింది. ఛీ! పాడుబతుకు! ముందుచూస్తే నుయ్యి, వెనకచూస్తే గొయ్యి! తెల్లారిందో లేదో ఆవురావురుమంటూ లేస్తారు, ఇంట్లో వాళ్ళంతా. పెద్దవాళ్ళకీ, చిన్న వాళ్ళకీ సదుపాయాలు చెయ్యలేక చస్తుంటే .... ఇక పని మనిషిని కూడా మానిపించేసి .... ఎలా చావటం? ఎన్ని గంటలకి లేస్తే ఈ చాకిరీ అవుతుంది? మరి రంగని మానిపించకుండా ఈ వెధవ భాగోతం ఎన్నాళ్ళు?

విసుగులేకుండా నమ్మకంగా చేసే పనిమనిషి కోసం సంవత్సరాల తరబడీ ఎదురుచూస్తే నిజంగా దేవుడు పంపించినట్టే దొరికింది రంగ. నిజంగా అది ఎంత మంచిదో తనకి తెలుసు. చంటిది చెప్పిన పని కూడా విసుక్కోకుండా చేస్తుంది. జీతానికి ఒప్పుకున్న పనులుగాక పైన ఎన్ని చెప్పినా చేస్తుంది. రంగ గడపలో కాలుపెట్టిన రెండు నెల్లనుంచి బోలెడు చాకిరీ తప్పించుకున్న అన్నపూర్ణకి ప్రాణం హాయిగా వుంది. నిజమే.

అయితేమాత్రం .... వెధవ ఇంటి పనికి జడిసి కాపరంలో నిప్పులు పోసుకుంటుందా? ఆ మాయదారి ఆఫీసు చదువేదో ప్రారంభించిన దగ్గర్నించి రామారావుని కట్టడి చెయ్యలేక పోతున్నానన్న భయం పట్టుకుంది అన్నపూర్ణకి.

కొన్ని కొన్ని గుణాలు పుటకతో వచ్చి, పుడకలతోటే పోతాయి. మధ్యలో మారేది కల్ల! .... రామారావు పరాయి ఆడవాళ్ళకేసి చూస్తోంటే .... ఆ చూపుల్లో .... వెకిలివేషాలు .... కన్పిస్తే అన్నపూర్ణకి ఎంత బాధగా వుంటుందో రామారావుకి తెలీదు. అసలు తను మరో ఆడదాని కేసి ఆశగా చూస్తున్నానన్న సంగతి కూడా అతనికి తెలీదు. అతను అన్నపూర్ణకేసీ చూస్తాడు, రోడ్డు మీద పోతున్న విశాలాక్షికేసీ చూస్తాడు, ఆఫీసులో కన్పించే సుశీలకేసీ చూస్తాడు.... అలాగే ... అలాగే రంగకేసీ కూడా చూస్తున్నాడు. కొన్నాళ్ళనించి అప్పుడప్పుడూ దానికేసి చూసి నవ్వటం ... ఏదో పని కల్పించుకుని మాట్లాడ్డం ... దానితోనే సిగరెట్లు తెప్పించుకుని దానిముందే ఒక సిగరెట్టు అంటించటం .... అలాంటి చేష్టలెన్నో .... ఎన్నెన్నో గూఢార్థాలు కనిపిస్తాయి అన్నపూర్ణకి.

అలాంటి సమయాల్లో మొగుడికేసి తీక్షణంగా చూస్తూ ... కింది పెదవి కసిగా కొరుక్కుంటూ .... సెగలా నిట్టూరుస్తూ .... పనులన్నీ అవకతవకగా చేస్తూ, పాలు పొంగబెట్టుకునీ, అన్నం చిమడ బెట్టుకునీ, అంతా గందరగోళం చేసుకుంటుంది.

'రంగని మానిపించేస్తే....?' అన్న ఆలోచన తళుక్కున మెరిసిందోనాడు. "అమ్మో! రంగని మానిపించేస్తే ఈ పనులన్నీ — చిమ్మ చీకటితో ముసలాయనకి స్నానం — తొమ్మిది గంటలకల్లా పెద్దవాడికి క్యారియర్ సర్దడం — సాయంత్రం వేళ కుర్ర వెధవలు నమలడానికేదో చిరుతిండీ .... నిత్యా ఇంటిల్లిపాదీ కట్టివిడిచే గుడ్డల చాకిరేవూ .... దేవుడా! రంగనే మానిపిస్తే నా పాట్లు నాకు రావూ? 'మన బంగారం మంచిదైతే' అన్నట్టు .... ఈయనకు బుద్ధివుండాలిగానీ పని మనిషి లేకుండా అవుతుందా? .... పిచ్చి!" అనుకుంటూ.... తనని తను సముదాయించుకుంటూ వూరుకుంది అన్నపూర్ణ ఆనాడు.

కాని.... కాని.... రామారావు తెల్లారగట్ల లేచి డిపార్టుమెంటు పరీక్షలంటూ వరండాలో కూర్చుని పెరట్లో అంట్లు తోముతోన్న రంగని .... వాకిలి తుడిచి నీళ్ళు చిమ్ముతోన్న రంగని .... చకచకా పనులన్నీ చక్కబెట్టుకుంటోన్న రంగని .... అలా వివిధ రూపాలుగా .... వివిధ కోణాల్లోంచి చూస్తూ మురిసిపోవటం .... అన్నపూర్ణ సహించగలిగేటంత కమ్మటి విషయం మాత్రం కాదు. అక్కడికీ అంది కిందటిరోజు — "తెల్లారగట్లలేచి వరండాలో కూర్చోటం ఎందుకు? ఫర్వాలేదు, నాకు లైటువున్నా నిద్రపడుతుంది. మీరు గదిలోనే చదువుకోండి" అంది.

'అలాగేలే' అన్న రామారావు యధాప్రకారం వరండాలో తిష్టవేసి 'అబ్బే! నువ్వు నిద్రపోతోంటే నేను లైటు వేసుకుని కూర్చోటం బాగుంటుందా? .... నువ్వు కదుల్తోంటే .... నేను చదవగలనా?' అంటూ అనురాగం ఒలకబోస్తే కరిగి నీరైపోడానికి అన్నపూర్ణేం పిచ్చిదా, వెర్రిదా? తెలివి తక్కువదా? — "బాగుంది. వ్యవహారం ముదురుతున్నట్టే వుంది" అనుకోకుండా ఉండగలదా?

నీతి నియమాలకోసం పడిచావాలన్నది ఒక్కటే అన్నపూర్ణ అభిప్రాయం కాదు. తన భర్త తన కళ్ళెదుటే ఇంకో ఆడదాన్ని అదోలా చూడటం .... ఆ ఆడదాని ఎదురు చూపులకోసం పడిగాపులు కాయటం .... అబ్బ! అది అన్నపూర్ణకి చాలా అవమానంగా వుంది. తన విలువ ఏమాత్రం మిగలనట్టు .... తన బతుక్కి అర్థమేలేనట్టు .... ఇక ఏ క్షణాన్నయినా తను చచ్చి పోవచ్చు నన్నట్టు — ఆ బాధ ఇముడ్చుకోటానికి శక్యం కానట్టు తోస్తోంది! భార్యాభర్తల మధ్య ఏ వ్యక్తీ జొరబడనేకూడదు గానీ .... అదే జరిగితే ఇక ఆ దాంపత్యానికి ఏం మిగులుతుంది? గతంలో వుండే నిశ్చింతా, సంతోషం...ఎక్కడ నిలుస్తాయి?... అలాంటి ఆలోచనలు వస్తేనే వణికిపోతుంది అన్నపూర్ణ.

రామారావు మనస్తత్వాన్ని ఇక తను మార్చలేదు. తను ప్రయత్నిస్తోన్న కొద్దీ అతను మొండివాడవు తున్నాడేమోనన్న భయంకూడా పట్టుకుంది. ఒక్కోసారి ఎంత దుఃఖం కోపం వస్తాయంటే, ఆ పూటే ఆ సంసారం వదిలేసి పోవాలనిపిస్తుంది. కానీ, ఎక్కడికి పోతుంది, ఈ పిల్లలతో? ఒక రోజా, రెండ్రోజులా?.... నెలేసి రోజులు మాట్లాడక పోయినా బుద్ధిరాదా మనిషికి! ఆ మనిషి ఖర్మకి ఆ మనిషిని వొదిలి పెట్టడం తప్ప ఇంకేం చెయ్యాలి?

రంగని మానిపించెయ్యాలి! మరేం చేస్తుంది? రంగని అతని ఎదురుగా తిరగనిచ్చి .... అతనిలో రోజు రోజుకీ వెధవబుద్ధి పెరగనిచ్చి .... చివరికి సంసారంలో చిచ్చుపెట్టుకోవాలా?

అన్నపూర్ణ మనసు చాలావరకు నెమ్మదించింది. చెల్లాచెదరైన ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి. గబగబా కాఫీలు .... పిల్లలకు చద్దన్నాలు .... వంటా వార్పూ .... తేలిగ్గా బంతిలా తిరిగింది. పది గంట లయ్యేసరికి అన్నపూర్ణ వెనకాల తిరిగే చంటిముండ తప్ప ఇంట్లో ఎవ్వరూ లేరు.

అన్నపూర్ణ చంటిదానికి ముందుజడ అల్లుతూ కూర్చుంది. రంగ వచ్చింది. రెండోసారి మళ్ళీ గిన్నెలు కడిగి, బట్టలు ఆరేసి, ఏమైనా పెడితే తిని వెళ్తుంది.

అన్నపూర్ణ చాలాసేపు కొత్త మనిషిని — చూస్తు న్నట్టే చూసింది రంగని. రంగ చీర కుచ్చిళ్ళు బొడ్లో దోపుకుంటుంది ఎప్పుడూ. పమిటి చెంగు కూడా బారుగా లాగి బొడ్లో దోపుకుంటుంది. జుట్టు మాత్రం ఎప్పుడు చూసినా నున్నగానే ఉంచుకుంటుంది. అప్పు డప్పుడూ రింగు ముడికూడా వేసుకుంటుంది. చెప్పొద్దూ, రెండు మూడుసార్లు రంగకి ముడి అన్న పూర్ణే చుట్టింది కూడా.

"కాస్త సబ్బుపెట్టి మొహం తోముకోవే, బొత్తిగా జిడ్డు కారుతోంది" అంటే, అది సరదాకొద్దీ సబ్బుతో మొహం అరగ తోముకుంటుంది. కడుక్కు వచ్చాక చూస్తే నిజంగా దాని నుదురూ, చెంపలూ నల్లగా నిగ నిగలాడుతూ నీడలు కన్పించేంత నున్నగా వుంటాయి.

"నువ్వు చక్కగా వుంటావే రంగా! నీ మొగు డెప్పుడన్నా ఈ మాటన్నాడా నీతో?" అంటే, ముసి ముసిగా నవ్వుతుంది. పాపం రంగ చాలా మంచిదే!

ఎంత మంచిదైతే ఎందుకు — తన కొంపతీసే మనిషయ్యాక?

రంగ పరపరా గిన్నెలు తోముతోంది నారింజ చెట్టుకింద.

అన్నపూర్ణ చంటిదానికి రిబ్బన్ను వేస్తూ "కాస్త బాగా తోమవే తల్లీ! పొద్దున్న గిన్నెలన్నీ మసిమసిగా వదిలేసి వెళ్ళావు. గ్లాసులవీ ఎలా కడిగావో ఏమిటో తడి ఆరేసరికి బూడిద పళ్ళల్లా తయారయ్యాయి. అన్నీ మళ్ళీ కడుక్కోలేక చచ్చాను, నీ పనీ నువ్వూనూ" అంది గబగబా.

అన్నపూర్ణ ఆ మాట లనటానికి ఎంత కష్టపడి గొంతు పెగుల్చుకుందో రంగకి తెలీదు. అది నమ్మ లేనంత ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూసింది.

"అదేమిటి అంత చోద్యంగా చూస్తున్నావు? గిన్నెలు సరిగ్గా తోమమన్నాననా?...."

అది రంగ నిజాయితీకే తీరని కళంకం అయి పోయింది. అలాంటి విషయాల్లో మాత్రం అది మంచి తనం ప్రదర్శించదు. ఖచ్చితంగానే అంది "నాను సుబ్బరంగా తోమినానమ్మా!"

"అయితే నేను అబద్ధమాడానంటావా? ఇది మరీ బాగుంది. 'డబ్బూ పోయే .... శనీ పట్టే' అనీ, చెప్పి చేయించుకోటానికి కూడా దిక్కులేదా ఏమిటి?"

"మీ రెప్పుడన్నా ఈ ముక్కన్నారా ఏంటమ్మా?"

"ఎందుకంటానూ? ఈ మధ్య నీకు తల బిరుసెక్కిందిలే. దిక్కులు చూడ్డంతో సరిపోతూంది గానీ పనేం చేస్తావూ?"

రంగ, గిన్నెలు కడగటం మానేసి భరించలేనంత అభిమానంగా చూసింది.

"ఎందుకీ మాటలమ్మా? మీ కిష్టంలేదని చెప్పండమ్మా!" అంది నిష్ఠూరంగా.

"చెప్తే ఏం చేస్తావూ?"

"ఇంకేం చేస్తాను? మానుకుంటాను."

"బాగుందేవ్! బెదిరిస్తున్నావా? నీకు ఇంకో ఇల్లు దొరక్కపోదు, మాకు ఇంకో మనిషీ దొరక్కపోదు. నీకు కష్టంగా వుంటే ముమ్మాటికీ మానెయ్యి!"

తెల్లబోయింది రంగ! అన్నపూర్ణమ్మ అంత ఖచ్చితంగా మాట్లాడుతుందని రంగ అనుకోలేదు. — "ఇష్టంలేకపోతే మానుకుంటానమ్మా! అంతేకానీ...." అంటూనే వుంటుంది అప్పుడప్పుడూ.

ఆ మాటతో లొంగిపోయే అన్నపూర్ణ ఈసారి మాత్రం రెచ్చిపోయింది తన సంతోషాన్ని కప్పిపుచ్చుకుంటూ — "చీటికీ మాటికీ 'మానేస్తా, మానేస్తా'నని బెదిరిస్తోంటే ఎంతకాలం సాగదియ్యగలను నిన్ను? నాకేనా అంత సిగ్గులేంది? నీమాత్రపు పని పాటలు నాకు రావనుకున్నావా ఏవిటి? పన్నెత్తి మాట అనకుండా చేయించుకునే వాళ్ళ దగ్గరకెళ్ళు! .... ఇవ్వాల్టికి నీకు రెండున్నర కాబోలు అయింది. ఇవిగో డబ్బులు, తీసుకో!" అంటూ డబ్బులు తెచ్చి చీడీనారన పెట్టింది.

రంగ మళ్ళీ తెల్లబోయింది. కాసేపటికి అదోలా నవ్వేసింది. రంగ మంచితనం అన్నపూర్ణకి తెలిసినట్టే, అన్నపూర్ణ మంచితనం రంగకీ తెలుసు.

"ఏటమ్మా అంత కోపం? నా నేమన్నాననీ?" అంది.

"కోపం ఎవరికే? నాకా, నీకా? మాటంటే మాటే. మర్యాదగా వెళ్ళు!" రంగతో అంత నిర్మొహమాటంగా మాట్లాడగలనని అనుకోలేదు అన్నపూర్ణ — ఆ మాటలనేసి చంటిదాన్ని చంకనేసుకుని గదిలోకి పోయింది. రంగ అక్కడే .... చీడీ దగ్గరే నించుని .... డబ్బులు తీసుకుని రొంటిన దోపుకుని .... "అమ్మా, ఎల్తన్నాను" అనేసి దొడ్డి గుమ్మం తీసుకుని వెళ్ళిపోయింది.

అన్నపూర్ణకి పుట్టెడు దుఃఖం వచ్చింది. అలా కూర్చుని కూర్చుని పన్నెండు గంటలకి, పిల్లలు వచ్చేవేళకి, లేచింది.

★ ★ ★

మర్నాడు.... చీకట్నే .........

ఎప్పటిలాగే లేచివచ్చింది అన్నపూర్ణ. రామారావు చదువుకుంటూనే ఉన్నాడు — అన్నపూర్ణని చూస్తూనే "రంగ రాలేదేం ఇవాళ?" అన్నాడు. అన్నపూర్ణ అతనికి దగ్గిరగా వెడుతూ "ఇళ్ళెక్కువయ్యాయట, మానేసింది. అప్పలమ్మని రమ్మని చెప్పాను. కాసేపటికి వస్తుంది" అంది. మొగుడి మొహంలో ఏదో బాధ .... కళ్ళల్లో ఏదో నిరాశ కనిపిస్తుందని తరిచి తరిచి చూసిన అన్నపూర్ణకి అవి కనిపించినట్టే అయ్యాయి.

"ఏం! మీకు బాధగా వుందా?" అంది నవ్వుతూ.

"నాకేం బాధ మధ్య?"

"ఏమో! చీటికీ మాటికీ సిగరెట్లకి పరిగెత్తేదిగా చిలకలా?"

రామారావు మాట్లాడలేదు.

ముసలాయన లేచి వచ్చాడు — "అమ్మాయ్! ఇవ్వాళ రంగ రానట్టుందే!"

"అవును మావయ్యా! దానికి వీలు కావటంలేదని మానేసింది. అప్పలమ్మ వస్తుందిలెండి. మీ స్నానానికి నేను నీళ్ళు పెడతాను, తుండుగుడ్డ తెచ్చుకోండి."

రామారావు గదిలోకి వెళ్ళిపోయాడు.

పిల్లలంతా లేచారు. అన్నపూర్ణ అంట్లగిన్నెలన్నీ పెరట్లోకి జేరేసింది.

సగం సగం పనులు అవుతోంటే వచ్చింది అప్పలమ్మ.

"ఇంకాస్త పెందలాడే రావటానికి వీలవదా అప్పలమ్మా?" నెమ్మదిగా అంటూ ప్రాధేయపడుతున్నట్టు చూసింది అన్నపూర్ణ.

"ఎట్ట తీరద్దమ్మా? సూత్తా లెండి."

కిక్కురు మనలేదు అన్నపూర్ణ. అసలు జీతంకన్నా ఓ అర్ధ రూపాయి ఎక్కువ పెంచి, అది కాదూ కూడదంటే ఏవేళకైనా సరే వచ్చి పని చెయ్యమని అప్పలమ్మని తనే బతిమలాడింది, గత సాయంత్రం. ఏరికోరి దాన్నే పిలవటానికి కారణం .... అది పడు

చుదికాదు. రామారావు దానికేసి చూడమన్నా చూడడు. అప్పలమ్మకి యాభయ్యేళ్ళు దాటి వుంటాయి. తల అక్కడక్కడ నెరిసి కలనేత బట్టలా వుంటుంది. రంగలా శుభ్రంగానూ వుండదు. రామారావు దానికేసి ఎందుకు చూస్తాడు?

నిజంగా రామారావు ఆ మర్నాటినుంచి వరండాలో చదవటం మానేశాడు. అన్నపూర్ణ ఏదో అడగాలని ఊరుకుంది. రంగని మానిపించేసి మొగుడికి బాగా బుద్ధి చెప్పాననుకుంది.

★ ★ ★

అప్పలమ్మ కూడా కొత్త సమస్య అయింది అన్నపూర్ణకి! అది రంగ చేసే పనిలో నాలుగో వంతు కూడా చెయ్యదు సరిగదా.... చిరాకులూ.... కోపాలూ .... కీచులాటలూనూ. రుసరుసలాడితే ఆడిందిలే, మిసమిస లాడదు కదా అని, అవన్నీ ఏవంతగా పట్టించుకోలేదు అన్నపూర్ణ.

కానీ .... ఉన్నట్టుండి అప్పలమ్మతో ముసలాయన సరసాలూ అవీ చూస్తోంటే, ఆశ్చర్యం ప్రారంభమైంది అన్నపూర్ణకి. ముసలాయన ధోరణి చాలా మారింది. ఎప్పుడూ వీధిలో కూర్చుని పురాణాలు వల్లెవేసుకునే ఆయన, ఉలిక్కిపడ్డట్టు వాకిట్లోకి తొంగి తొంగి చూడ్డం!.... స్నానం చేస్తూ చేస్తూ .... గోవిందనామాలు చదువుతూ మధ్య మధ్య అప్పలమ్మతో కబుర్లాడ్డం! చమత్కారాలు దొర్లిస్తూ చురుకు చురుగ్గా దానికేసి చూడ్డం! .... అంతా అయోమయంగా అయిపోయింది అన్నపూర్ణకి!

ఆయన వయసు కాలంలో విచ్చలవిడిగా తిరిగిన వాడేనని ఎప్పుడో రామారావే అన్నాడు. కానీ, ఆయనలో అలాంటి తత్వం అన్నపూర్ణకి ఎన్నడూ కనపడ లేదు.

ఇన్నాళ్ళకి అప్పలమ్మ ఎదట ఆయన తీరు చూస్తోంటే అన్నపూర్ణకి ఏమిటో ఏవగింపులాగనిపిస్తోంది.

"తాతగారూ, నీళ్ళు తోడినాను" అంటుంది అప్పలమ్మ.

"ఆహా! నువ్వు మహా కన్నెపిల్లవైనట్టు .... 'తాతగారూ' అంటావ్ నన్ను" అంటూ నవ్వుతా డాయన.

"అదేటిబాబూ! తాతగారంటే తప్పా? ఏం, నువ్వేం సిన్న కుర్రోడివా?" అని రెట్టిస్తుంది అప్పలమ్మ.

"అదిగో! అదే వొద్దన్నాను. నువ్వు నన్నలా పిలవడం యేవిటి? 'అయ్యగారూ' అనలేవూ?" నవ్వుతూనే కోప్పడతా డాయన.

"ఏటిబాబూ, నీదంతా సోద్దెం" అంటూ నవ్వుకుంటుంది అప్పలమ్మ.

ఆ సంభాషణ వాళ్ళిద్దరి మధ్యా రోజుకోసారయినా జరుగుతూ వుండాల్సిందే. అన్నపూర్ణ విని ఊరుకుంటుంది.

ఒక రోజు అప్పలమ్మ బల్లమీద నిలబడి గది గోడలు దులుపుతోంది. ముసలాయన హడావిడిగా వచ్చాడు. "వొసేవ్ అప్పీ! నీ నడ్డి మీదికి .... అదిగో అదిగో .... తేలుపిల్ల ఎగబాకుతోందే!" అని అరిచాడు.

అప్పలమ్మ కెవ్వుమంటూ చీపురు విసిరేసి దభీమంటూ కిందికి బోర్లాపడ్డంత పనిచేసింది.

కంగారుగా పరుగెత్తుకు వచ్చిన అన్నపూర్ణ, ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూన్న మామగారి వాటం కనిపెట్టి మొహం చిట్లిస్తూ .... కాస్త దురుసుగానే అంది — "నయమే! నిజమే కామాలనుకున్నాను నేను. పని మనిషితో మీకా పరాచికాలేమిటి? దాన్ని పనిచేసుకో నివ్వరు. బాగుంది వరస" అని రుసరుసలాడింది.

అప్పటికీ ముసలాయన నవ్వుతూనే వున్నాడు "నేనేం పరాచికాలాడానే? దాని కొంగుమీద ఏదో తేలుపిల్లలా పాకుతున్నట్టే చూశాను. గుడ్డలో జొరబడిందేమో, చూసుకొమ్మను" అన్నాడు.

"అమ్మో! అమ్మో! ఎక్కడమ్మో" అంటూ అప్పలమ్మ భయంతో గంతులేస్తూ కుచ్చెళ్ళన్నీ ఊడలాక్కుని చూసుకొంటూంటే అన్నపూర్ణ లోపలికి పరిగెత్తింది.

తేలుపిల్లా లేదు, వల్లకాడూ లేదు. అప్పలమ్మకు మాత్రం ముసలాయన మీద కోపం రాలేదు. "ఏంటి బాబూ! నువ్వూ నీ ఆసికాలూనూ" అంటూ చేతులు తిప్పింది. నయం — అది దెబ్బలాడుతుందేమోనని అన్నపూర్ణ హడలిపోయింది.

మధ్యాన్నం ఉప్పుడు పిండి చేసింది అన్నపూర్ణ. మావగారికీ, పిల్లలకీ పెట్టింది. అంట్లు తోమడానికి

సిద్ధమవుతోన్న అప్పలమ్మతో "ఒక్క క్షణం ఆగూ, కాస్త ఉప్పుడి పిండి తిని తర్వాత కడుగుదువుగానిలే" అని గిన్నితో పెట్టింది.

అప్పలమ్మ గోడవారన చతికిల బడింది తింటూ.

"అప్పీ! మా తాత పిలుస్తున్నాడే!" అంటూ వచ్చాడు రెండోవాడు.

"ఎందుకూ?" అంది అన్నపూర్ణ.

"ఉప్పిండి తింటానికి" అంటూ పరిగెత్తాడు వాడు.

అంతలోనే "ఒసేవ్ అప్పీ! ఇలా వచ్చి పట్టుకు పో!" అంటూ అరిచాడు ముసలాయన.

అన్నపూర్ణ చటుక్కున లేచి గుమ్మం దగ్గిరకెళ్ళి — "ఏవిఁటీ! అప్పలమ్మకి నేను పెట్టాను" అంది.

"పోనీ తిననిద్దూ! నా కెలాగూ ఎక్కువవుతుందని ఓ గుప్పెడు తీశాను" అంటూ ఆ కంచం గుమ్మం ఇవతల పడేశాడాయన. అప్పలమ్మ అందుకుని, ఓ కాయితంలోకి వొంపుకుని కొంగులో కట్టుకుంది, తనకి అది ప్రత్యేక బహుమతి అయినట్టు! ఆ మనిషి తప్పేంవుంది?

అన్నపూర్ణ ఏమీ మాట్లాడలేకపోయింది. "పొద్దుట పూట కాస్త తొందరగా వస్తూ వుండు అప్పలమ్మా!" అంటూ హెచ్చరించి సాగనంపింది.

మర్నాడు చిమ్మచీకటినించే చినుకులూ ఈదురు గాలీ పట్టుకున్నాయి. అప్పలమ్మ రానేలేదు. "అప్పి రాలేదే! అప్పి రాలేదే!" అంటూ ముసలాయన గోవింద నామాలు మానేసి తారట్లాడుతూ తిరిగాడు.

అన్నపూర్ణ ఇంటి పనుల్లో సతమతమవుతూ పట్టించుకోకుండా ఊరుకుంది.

మధ్యాన్నం సన్న సన్న చినుకుల్లో నాలుగు గంటలవేళ వచ్చింది అప్పలమ్మ.

దాన్ని చూస్తే ఏమిటో మహదానందమైంది ముస లాయనకి. "ఎంత వాన కురిస్తేమాత్రం నువ్వు రాక పోతే ఇంటెడు చాకరీతో పిల్లవెధవలతో అదెలా దేవు ళ్ళాడుతుం దనుకున్నావ్? బావుందే నీ వరస! ఇంటి దగ్గిర వెచ్చగా పడుకున్నావు కావాలు" అంటూ మొహ మంతా నోరు చేసుకుని కోప్పడ్డా డాయన, అప్ప లమ్మని.

అప్పలమ్మ గబగబా పని అయిందనిపించింది. చినుకులు ఎక్కువై వర్షం ధారల్లా పడుతోంటే వెళ్ళలేక వరండాలో కూర్చుంది .... ముసలాయన కాయితం పడవలు చేసి చంటిదాని చేతికిస్తూ వరండాలోనే కూర్చున్నాడు.

అన్నపూర్ణ గదిలోకి పోయింది.

"పాడుముండా వాన! తగ్గిపోద్దనుకున్నాను. సీకటి పడిపోతంది — కొంపకెలా సేరటం!" అంటూ అప్ప లమ్మ స్వగతం చెప్పుకుంటూంది.

ముసలాయన ఓ అడుగు దానికేసి వెయ్యటం చూసింది అన్నపూర్ణ.

"ఇక్కడ వుండిపోరాదటే రాత్రికి?" అన్నాడు.

"అమ్మో! ముసిలోడో.... గుడిసిలో ఒక్కడూ...."

"ఐతే వానని తిడతావెందుకూ? పోరాదూ?"

"ఈ వానలోనే! తడిసిపోనూ?"

"తడిస్తేనేం, వాడున్నాడుగా! వెచ్చ.... వెచ్చగా.... కావిటేసుకుని, మంచం వుందా, చాపగుడ్డేనా?"

అన్నపూర్ణ నిర్ఘాంతపోయింది .... తన మామగారు .... ఆ విధంగా మాట్లాడగలడంటే .... కోడలు వింటుం దన్న ఇంగితం కూడా లేకుండా....!

అప్పలమ్మకి కూడా చాలా కోపం వచ్చినట్టుంది. "ఏంటిబాబూ, నీ ఊసులూ నువ్వూనూ" అంది చుర చురా చూస్తూ.

"ఒసేయ్! నీకు నిజంగా అంతకోపం వచ్చిం దంటే? తెచ్చుకున్నావ్ గానీ...."

"నీ ఒళ్ళు బారకించిందేటి బాబూ! ఓ గుంటని చూడమంటావేఁటి, పెళ్ళాడుదువు గాని...."

"నా కెందుకే? నువ్వే మొగుణ్ణి చూసుకో!"

"నాకున్నాడుగా? నీకే...."

వినలేకపోయింది అన్నపూర్ణ. చెవులు మూసు కుంది.

తగ్గుముఖం పట్టింది వర్షం. అప్పలమ్మ లేచి గోనె గుడ్డ నెత్తిమీద వేసుకుంది. ముసలాయన చూస్తూ నిలబడ్డాడు.

★ ★ ★

"ఏం, అప్పి రాలేదూ? ఎందుకు రాలేదూ!" అంటూ తరిచి తరిచి అడిగాడు ముసలాయన, అంట్లు తోముకుంటోన్న అన్నపూర్ణని.

"నేనే మానిపించేశాను. వెధవ పని మనుషులు! వస్తారు, ఓ గడియ వుండి పోతారు. నా చాకిరీ నాకు తప్పదు. చేతిలో ఆసరాగా ఓ పిల్లనే ఉంచుకుంటాను. మూడుపూటలా తిని ఇంట్లోనే వుంటుంది" అంది అన్నపూర్ణ గబగబా గిన్నెలు కడుగుతూ.

"పిల్ల కుదిరిందా?"

"అదే కుదురుతుంది."

"పోనీ అది కుదిరేవరకన్నా అప్పిని వుంచలేక పోయావా? నీకు ఇబ్బంది కదా?"

"నాకేం ఇబ్బందిలేదు లెండి. మీరు స్నానం చెయ్యండి. నీళ్ళు పెట్టాను" అన్నపూర్ణ రెండు చేతుల నిండా గిన్నెలు పట్టుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రెండు రోజుల్లో రవణ కుదిరింది. దానికి పన్నెండేళ్ళు వుంటాయి. తొడలు బిగబడుతోన్న లాగూ.... జోలిలా వేళ్ళాడుతోన్న పెద్ద రవికా వేసుకుని వచ్చింది. వెంట్రుకలు సూదుల్లా మొహం మీదికి పడుతోంటే మాటిమాటికీ చెవుల వెనక్కి గెంటు కుంటూ నించుంది.

దాని వాటం అన్నపూర్ణకేం నచ్చలేదుగానీ, 'కాస్త తీర్చిదిద్దితే అదే బాగుంటుంది' అని సరిపెట్టుకుంది.

ఓ గంటయ్యాక ఏవో చిన్నచిన్న పనులు చెప్పింది. చీకటి పడుతోంటే దాన్ని కాసిన్ని నీళ్ళు పోసు కోమని చెప్పి పెద్దపిల్ల పాత గౌను ఒకటి తీసి ఇచ్చింది.

ఓ వారం అయ్యేసరికి రవణ చాలా పొందికలోకి వచ్చింది. శుభ్రంగా చురుగ్గా పనులన్నీ చేస్తోంది.

అన్నపూర్ణ ప్రాణం తెరిపిన పడింది. "ఒసే, నీకు గౌనులు బాగా లేవే! రెండు లంగాలు కుట్టించమని చెప్పవే మీ అమ్మతో. నేను వోణీలు కొంటాను. చిన్న చిన్న పైటలు వేసుకుందువుగాని...." అంది.

రవణ సిగ్గుపడింది. ఉత్తగౌను తొడుక్కుంటే దానికీ ఎబ్బెట్టుగానే కనపడుతోంది — "నాకు ఓ పరికిణీ ఉందమ్మా!" అంది గొప్పగా.

"అయితే ఇహనేం? తెచ్చుకో. ఆనక పెద్దబాబుకి క్యారియర్ తీసి కెళ్ళినప్పుడు మీ ఇంటికెళ్ళి అడిగి తెచ్చుకో" అంది అన్నపూర్ణ.

రవణ మూలంగా కొత్త సదుపాయం కూడా ఒకటి జరుగుతోంది. క్యారియర్ మనిషి వచ్చేసరికి ఆదరా బాదరా వండి పంపించక్కర్లేకుండా, తాపీగా రవణే క్యారియర్ తీసికెళుతోంది స్కూలుకి. అది మరీ సౌకర్యంగా ఉంది.

ఆ రోజు రవణ స్కూలునించి క్యారియర్ తిరిగి తీసుకు వచ్చి తెల్లగా తోమి బల్లమీదపెట్టి బొడ్లోంచి ఏమిటో తీసుకుని చప్పరిస్తూ కూర్చుంది.

చంటిపిల్ల దాన్ని చూసి ఏడుస్తూ "అమ్మా, నాకూ అప్పచ్చి పెట్టవే" అంటూ నిద్రపోతున్న అన్నపూర్ణ దగ్గరికి వెళ్ళి చెవిలో ఆరున్నొక్క రాగం సాగించింది. చిరాగ్గా లేచిన అన్నపూర్ణ సంగతేమిటో తెలుసుకుని, "ఒసే రవణా! ఇలారా! ఏమిటి నువ్వు తింటోంది?" అంటూ కేక పెట్టింది.

రవణ ఒకసారి గట్టిగా చప్పరించి ఎంగిలి జీడీ తీసి మరీ చూపించింది.

"ఎక్కడిదే నీకదీ?"

"అబ్బాయిగా రిచ్చారమ్మా!"

"ఎవరూ? పెద్దవాడా? ఎప్పుడూ?"

"ఇందాక బడి దగ్గర...."

"నువ్వడిగావా?"

"ఊహుఁ"

అంతకన్నా తర్కించలేదు అన్నపూర్ణ. ఏడుస్తోన్న చంటిదాని చేతిలో కాస్త బెల్లంముక్క పడేసి, మళ్ళీ పడుకుంది. నిద్రపట్టలేదు. పెద్దవాణ్ణి అడిగేవరకూ ఆ ధ్యాస పోదనుకుంది.

సాయంత్రం వాణ్ణడిగితే 'ఇహిహి' అంటూ నవ్వే శాడు. "అందరూ కొనుక్కుతింటూంటే అది ఊరకే చూస్తోందమ్మా! పాపం తింటుందని...."

పెద్దవాడు జాలిపడి ఇచ్చాడనుకుంది. పిల్లాడికి అంత జాలిగుణం వున్నందుకు సంతోషం కూడా వేసింది. కానీ ఎందుకో.... మళ్ళీ అదంతా నమ్మబుద్ధి కాలేదు. ఐనా వాడి పసిమొహంచూస్తూ ఏమీ ఆలోచిం చనూ లేకపోయింది. "ఇంకెప్పుడూ అలా చెయ్యకు! నేను అప్పుడప్పుడూ అణా — అర్ధణా ఇస్తూనే వున్నాను. అదే కొనుక్కుంటుంది" అని ఊరుకుంది.

రాత్రుళ్ళు పిల్లలు చదువుకునేటప్పుడు రవణ వాళ్ళ దగ్గిరజేరి బొమ్మలవీ చూస్తూ ఉంటుంది. పలక మీద నాలుగక్షరాలు దిద్దుతూ వుంటుంది. ఆరోజు

కూడా అలాగే వాళ్ళ దగ్గిర కూర్చుంది. పిల్లలు చదువులు ఆపేసి దాన్ని ప్రశ్నలు వేస్తూ కూర్చున్నారు.

"నీకు చదువురాదు కదా, అయితే ఉత్తరాలవీ ఎలా రాస్తావు? సినిమాలవీ చూస్తే అర్ధమవుతాయా?" అంటూ పెద్దవాడు ఆసక్తిగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు.

"చదువుకునే వేళప్పుడు ఏవిటా కబుర్లు దాన్తో!" అంటూ కొడుకుని తిట్టి "రవణా! నువ్విలా రా! తాతగారి కంచం కడిగి తీసుకురా! వాళ్ళు చదువుకుంటూంటే అక్కడెందుకు నువ్వు?" అంటూ గట్టిగా అరిచింది అన్నపూర్ణ. తనలో తనుమాత్రం 'వెధవ గోల' అనుకుంది.

కొత్త గోల వొచ్చి పడ్డట్టయిపోయింది.

★ ★ ★

మిట్టమధ్యాన్నం ఎండ, ఎర్రగా కోపంతో రుసరుసలాడుతున్నట్టుగా వుంది.

అన్నపూర్ణ పిల్లల్ని పడుకోబెట్టి తనూ పడుకుంది. బడికి శెలవు. పెద్దవాడు కూడా ఇంట్లోనే ఉన్నాడు. గాలిపటమో ఏదో కట్టుకుంటూ కూర్చున్నాడు.

చేతిలో పుస్తకం వుండగానే నిద్రపట్టేసింది అన్నపూర్ణకి. పెరట్లో ఏవో పరుగులూ .... గంతులూ! తుళ్ళిపడ్డట్టే లేచింది. బద్ధకించకుండా చటుక్కున వరండాలోకి వెళ్ళింది.

పెద్దవాడు రవణ జడ గట్టిగా పట్టుకుని పారిపోకుండా ఆపుజేస్తూ మీదిమీదికి ఒంగి నవ్వుతున్నాడు.

"ఒరేయ్! ఏమిట్రా అది?" ఒక్క అరుపు అరిచింది అన్నపూర్ణ.

పెద్దవాడూ, రవణా ఇద్దరూ బిత్తరపోయారు. వాడు దాని జుట్టు వదిలేశాడు. నెమ్మదిగా వస్తూ .... నవ్వుతూ "ఏమీ లేదమ్మా! చీపురు పుల్లలు తెమ్మంటే తేనని పరిగెత్తుతోంది. పట్టుకున్నాను" అంటూ మళ్ళీ గాలి పటాల పనిలో నిమగ్నమయ్యాడు.

రవణ ఊరుకోలేదు — "అది కాదమ్మా! నేను సూత్తా కూచుంటే గ్లాసుడు నీళ్ళు నా మీద పోసినారు .... నేను పరిగెత్తాను."

అన్నపూర్ణ దానికేసి చూస్తూనే ఉంది. దాని రవికంతా తడిచి గుండెలకి అతుక్కుపోయి వుంది. దానికేసి పెద్దవాడు చూస్తోంటే అన్నపూర్ణ ఒళ్ళు చచ్చిపోయినట్టయింది.

అన్నపూర్ణకి విపరీతమైన కోపంకూడా వచ్చింది. "ఛీ! మీ వారసత్వం నాశనంగానూ! ఇక మీకీ జన్మకి విముక్తి లేదర్రా? పోయిన పాడుగునా ఇదే పాటా? పాడు బతుకులు!" అంటూ గబగబా లోపలికి వెళ్ళి పర్రున ఒక పాత చీర చింపి రెండు బారల గుడ్డముక్క తెచ్చి రవణ మీదికి విసిరింది.

"ఒసేవ్! అది పమిటేసుకో. ఫో! ఇంటికి ఫో! చాలు, కొరివితో నెత్తి గోక్కున్నట్టే వుంది."

రవణ తెల్లబోయి నించుంది. పెద్దవాడు బిగుసుకు పోయాడు.

అన్నపూర్ణ కొడుకుకేసి చూస్తూ విసురుగా అంది. "నంగనాచి వేషాలు చాలుగానీ లేచి వెళ్ళి రంగని పిల్చుకురా! శాస్త్రి గారింట్లో వుంటుంది. నేను రమ్మన్నానని చెప్పు! ఊఁ, లేవ్వేం? లేచివెళ్ళూ!"

పెద్దవాడు బైటికిపరిగెత్తాడు.

అన్నపూర్ణకి బరువు దిగిపోయినట్టయింది.

"నాకెంత బుద్ధి లేదో! మొగాళ్ళు వెంట పడ్డారని ఆడాళ్ళు లొంగిపోతారా? రంగ నిప్పులాంటి మనిషి! ఒక్కరోజున కూడా ఈయన్ని కన్నెత్తి చూసేదికాదు. ఈయన బుద్ధి చెడిందని దాని బుద్ధి చెడుతుందా? అనవసరంగా దాని మనసు బాధపెట్టాను. ఎంత పిచ్చితనం! ఈయన వెధవ్వేషా లెక్కువైతే చెప్పుచ్చుక్కొట్టమని చెపుతాను.... అంతేగానీ...."

"అమ్మా! రంగ, దార్లోనే కనపడింది...." అంటూ పెద్దవాడు బాణంలా దూసుకొచ్చాడు.

వెనకాలే రంగ జంకుతూ వొచ్చింది.

"ఏం లేదు లేవే రంగా! ఏదో అయిందిలే. ఏమీ అనుకోకు. నీ పని నువ్వు చేసుకోవే! నువ్వు లేకపోతే నాకు మతిపోయినట్టుంది" ఆ నాలుగు మాటలకే అన్నపూర్ణకి కళ్ళు చెమర్చినట్టయింది.

రంగ తెల్లబోతూ నించుంది.

రవణా అంతే!

[1965 జనవరి 'అభిసారిక' మాసపత్రికలో] ★